

కోట ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవిని నియమిస్తూ సోమవారం రాత్రి డిఎంఎ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. వైసిపి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై అదే పార్టీకి చెందిన 28 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించడంతో నిర్ణయం వెలువరించకుండా వాయిదా వేశారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ విదేశీ పర్యటనకు వెళుతున్నట్లు, రెండు నెలల పాటు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాలేనని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. దీంతో సునేత్రాదేవిని ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్‌గా నియమించినట్లు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు.

పల్లె వెలుగుకే ఉచిత బస్సు?

- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు
- జిల్లాలో ప్రయాణినికే అవకాశం
- వేధిస్తున్న బస్సుల కొరత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో మాత్రం చంద్రబాబు ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకటి రెండు హామీలు మినహా మిగిలిన వాటిని పట్టించుకోవడం లేదు. దానిలో ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉంది. అయితే ప్రజల నుంచి తీవ్ర ఒత్తిళ్ళు వస్తున్న నేపథ్యంలో ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ నేటికీ ఈ పథకం అమలుపై విధి విధానాలను పూర్తిస్థాయిలో నిర్ణయించలేదన్నట్లుగా తెలుస్తోంది. కేవలం జిల్లా వరకే పరిమితం చేస్తూ పల్లె వెలుగు బస్సు వరకే ఈ పథకాన్ని అమలు చేసే యోచనలో సర్కారు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు పథకాన్ని గతంలో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్లు మహిళల నుంచి వినిపిస్తున్నాయి.



కాకినాడ జిల్లాలో 304 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో వెన్నెల ఎసి బస్సులు 2, నైట్ రైడర్స్ 2, అమరావతి 4, ఇంద్ర ఎసి బస్సులు 17, స్టార్ లైనర్ 4, సూపర్ లగ్జరీలు 57, అల్ట్రా డీలక్స్ 24, ఎక్స్‌ప్రెస్‌లు 19, అల్ట్రా పల్లె వెలుగు 39, పల్లె వెలుగు బస్సులు 136 ఉండగా ఇవి రోజుకి 1,14,630 కిలోమీటర్లు నడుస్తున్నాయి. సరాసరి రోజుకి సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకి దాదాపు రూ.52 లక్షల వరకూ ఆర్‌టిసికి ఆదాయం సమకూరుతోంది.

జిల్లా వరకే ప్రయాణ అవకాశం

పక్కనున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు అవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైనే గడుస్తున్నా నేటికీ దాని ఊసే ఎత్తడం లేదు. దీనిపై ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామంటూ ప్రకటనలు ఇస్తున్నారు. కానీ అప్పటి నుంచైనా పూర్తి స్థాయిలో ఈ పథకం అమలవుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దానికి తోడు కేవలం ఈ జిల్లా పరిధిలో మాత్రమే ఉచితం అమలు చేస్తామంటూ మంత్రులు పలు సందర్భాల్లో ప్రకటిస్తున్న నేపథ్యంలో మహిళల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి రాకముందు రాష్ట్రమంతా అన్ని సర్వీసులకు ఉచిత ప్రయాణమంటూ ప్రచారం చేశారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు పరిమితులు విధించడం సరికాదంటున్నారు. మరోవైపు పల్లె వెలుగు బస్సులకు మాత్రమే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో అనేక చోట్ల పల్లె వెలుగు సర్వీసులు తిరగడం లేదు. ఇప్పుడున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో జిల్లాలో పల్లె వెలుగు బస్సులు అందుబాటులో లేవు. అనేక ప్రాంతాలకు నేటికీ ఆర్‌టిసి సర్వీసులు వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. పేద, సామాన్య వర్గాలకు ప్రైవేటు వాహనఛార్జీలు భారంగా మారుతున్నాయి. ఆటో ఎక్కి దిగాలంటే రూ.50 ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అన్ని ప్రాంతాలకూ ఆర్‌టిసి సర్వీసులు గనుక నడిస్తే సామాన్య ప్రజానీకానికి కాస్త ఊరట లభిస్తుంది. మరో వైపు ఉచిత బస్సు కూడా నిబంధనలను విధించకుండా పూర్తిస్థాయిలో అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

అదనపు బస్సులు ఉండవు

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. దానికి మేము సిద్ధంగానే ఉన్నాం. ఈ పథకం అమలుయితే రూ.6 నుంచి రూ.7 లక్షల ఆర్‌టిసి అదనపు భారం పడుతోంది. ప్రస్తుతమున్న సమాచారం మేరకు పల్లె వెలుగు, అల్ట్రా, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఈ పథకం వర్తిస్తుంది.

–ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి,కాకినాడ.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

త్వరలో గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు పనులు

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలో ఎంతో కీలకమైన గొల్లపాలెం- కుయ్యేరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను అతి త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం అయితపూడి గ్రామ పర్యటనలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రాన్ని కలుపుతూ ప్రజలందరికీ ప్రయోజనకరమైన కుయ్యేరు గొల్లపాలెం రహదారి కాంట్రాక్టర్ ఇబ్బందుల కారణంగా నిలిచిపోయాయని తెలిపారు. ఈ మేరకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. తమ రాజకీయ స్వార్థం కోసం కొందరు ప్రతిపక్ష నాయకులు చేసే అవగాహన లేని ఆరోపణలను పట్టించుకోవద్దని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సహకార సంఘం అధ్యక్షులు కొల్లు వెంకటేశ్వరరావు, సిరిపురం డిసి నారాయణరావు, టిడిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు నారాయణమూర్తి, మేడిశెట్టి పెద్ద, కొప్పిశెట్టి స్వామినాయుడు, యాళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండబాబు

ఏడాదిలోనే రెట్టింపు స్థాయిలో సంక్షేమం

ప్రజాశక్తి-కాజులూరు

ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెట్టింపు స్థాయిలో సంక్షేమ పాలన అందించారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిప్పరాజుపాలెం, ఐతపూడి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అయితపూడి, తిప్పరాజుపాలెం సర్పంచులు పెద్దిరెడ్డి చందర్రావు, యాళ్ల మాణిక్యంబ, కొల్లు వెంకటేశ్వరరావు పి.నారాయణరావు, అన్యం శ్రీరామచంద్రమూర్తి, వనం వీరబ్రహ్మం, చవ్వాకుల నారాయణమూర్తి, మేడిశెట్టి పెద్ద పాల్గొన్నారు.

గొల్లపాలెం-కుయ్యేరు రహదారి కోసం వినతి

ప్రజాశక్తి-కాజులూరు

గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు, కాజులూరు మెయిన్ రోడ్డులో ఉన్న శిథిలమైన వంతెనల నిర్మాణాలు చేపట్టాలని తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపిడిఒకు మంగళవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు రాజబాబు, నానాజీ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం రోడ్లు శిథిలమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలు ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు గోతుల్లో పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వంతెన నిర్మాణాలు చేపట్టాలని, సాధ్యమైనంత తొందరగా ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణాలు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

పి4లో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-కాకినాడ

పి4 పథకంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు అవ్వాలని సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో పి4 పథకంపై ఎంఎల్ఎ కొండబాబు అధ్యక్షతన నగరంలోని వ్యాపార, పారిశ్రామికవేత్తలు, భవన నిర్మాణదారులు, వైద్య ప్రముఖులు, విద్యా సంస్థలు ప్రతినిధులు, ఉద్యోగులతో అవగాహన, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో అట్టడుగున ఉన్న పేద ప్రజలను పైకి తీసుకువచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, ధనవంతులు ఈ బహత్తర కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. 20 నుంచి 25 కుటుంబాలకు చేయూత ఇచ్చేందుకు మున్సిపల్ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుధాకర్, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, మునిసిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

పట్టణ పరిధిలోని సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు కృషి చేయాలని పలువురు కౌన్సిలర్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వైస్ చైర్మన్ నెక్కటి సాయిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడారు. లక్ష లీటర్ల కెపాసిటీ గల బూస్టర్ వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పరిశుభ్రత పనులు చేపట్టినప్పుడు కదులుతోందని, దీని స్థానంలో నూతన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ పరిధిలో వీధిలైట్లు సమస్య తీవ్రంగా ఉందన్నారు. సూరంపాలెం రహదారి జగనన్న కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి ట్యాంక్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పెద్దాపురం మెయిన్ రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. తొలుత ఇటీవల మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పప్పుల రామకృష్ణ మతికి సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో డిఇ డిఎస్.ప్రకాశరావు, ఎఇ పివి.సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సిహెచ్.ఫణి కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎల్‌ఐసి ఏజెంట్ల సంక్షేమాన్ని పట్టించుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఎల్‌ఐసి ఏజెంట్ల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని, ఎల్‌ఐసిని ప్రైవేట్ పరం చేయడం తగదని ఎల్‌ఐసి ఏజెంట్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కోనాడ ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన ఎల్‌ఐసి ఏజెంట్ల జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరరావు, రవి ప్రకాష్ మాట్లాడారు. ఎల్‌ఐసి ఏజెంట్లు తక్కువ వేతనాలతో ఎల్‌ఐసి అభివృద్ధి కోసం ప్రజల భద్రత కోసం పనిచేస్తున్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం ఎల్‌ఐసి ఏజెంట్ల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ హాజరయ్యారు. సభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న పట్టు రైతులు, అధికారులు

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టు సాగు చేసే రైతులు సాంకేతికత విజ్ఞానం సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలు ఉపయోగించుకుని పట్టు సాగులో లాభాలు పొందాలని మైసూర్ సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ ఎస్.గాంధీ దాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని చేబ్రోలు మను ఫంక్షన్ హాల్లో సెరి కల్చర్‌పై ఎపి సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎపి సెరికల్చర్ ఎడి సి.అరుణ కుమారి, సెరి కల్చర్ అధికారి ఎ.పౌలు రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ సత్యనారాయణ, పాడేరు సెరికల్చర్ ఆఫీసర్ కె.అప్పారావు పాడా డైరెక్టర్ ఎన్‌వివి.సత్యనారాయణ, సైంటిస్ట్ ఇ.భువనేశ్వరి, సైంటిస్ట్ బి.వజ్రమ్మ పాల్గొన్నారు

'హామీలు అమలు చేయలేక వంకలు'

ప్రజాశక్తి - జగ్గంపేట

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను చేయలేక వంకలు పెడుతున్నారని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లు రాజుబాబు, నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఒమ్మి రఘురామ్, అనసూరి ప్రభాకర్, తోట రామ్‌జీ పాల్గొన్నారు.

3న మహా అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

37 రోజులపాటు జరిగే మరిడమ్మ అమ్మవారి జాతర ఈ నెల 31తో ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ ముగింపు సందర్భంగా ఆగస్టు 3న ఆలయ కళ్యాణ మండపంలో మహా అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించాలని డిఇఒ పి.రమేష్ సూచించారు. మంగళవారం స్థానిక ఆనందభారతి హైస్కూల్ ప్రాంగణంలో కాకినాడ నగరపాలక సంస్థకు సంబంధించిన ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధాన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఇఒ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడానికి అవసరమైన చర్యలను ఏ విధంగా చేపట్టాలో వివరించారు. ఇప్పటికే నాస్ సర్వేలో వెనుకబడి ఉన్నామని విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంచడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రవి, సుబ్బలక్ష్మి, రాజు, శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, పుష్పగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం విస్తతంగా ప్రచారం నిర్వహించారు. బొప్పేవారి వీధి, తిమ్మరాజుపేట, గౌరీకోనేరు వీధి, అంకయ్య పేట, వీరయ్యమ్మ పేట, సుబ్బయ్య పేట మీదుగా ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పెంపుదలకు నిరసనగా సిపిఎం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో అధిక సంఖ్యలో ప్రజానీకం పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు వ్యక్తులకు విద్యుత్ రంగాన్ని అప్పగిస్తే ప్రజలు ఇబ్బందులు పడక తప్పదన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండని చెప్పిన లోకేష్ ఇప్పుడు ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మి దారపు రెడ్డి కృష్ణ, రొంగల అరుణ్ కుమార్, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

మధ్యాహ్నం భోజనం ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రస్తుత నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన మెనూ ఛార్జీలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రమళ్ల పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ భోజనం పథకంగా మార్చారని కానీ నిధులు విడుదల చేయటంలో మాత్రం నిర్లక్ష్యం కనబడుతోందన్నారు. విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందించాలని చెబుతున్న ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన మధ్యాహ్న భోజనం విధులు మాత్రం విడుదల చేయటం లేదన్నారు. అనంతరం మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాయినగర్ ఇరుకు రహదారికి మోక్షం

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోట సాయి నగర్‌కు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండి వాహనదారులు, స్థానికులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా, వర్షాకాలంలో గోతులతో ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక టిడిపి నాయకులు ఈ సమస్యను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లగా ఆయన మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యకు తగిన సూచనలు చేశారు. మంగళవారం జెసిబి సాయంతో రహదారి విస్తరణ పనులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ రహదారి మఠం సెంటర్ సమీపం నుంచి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, సాయి నగర్ వరకు వెళ్తూ ముఖ్య రహదారిగా ఉపయోగపడుతోంది.



వసతి ఏర్పాట్లపై ఆదేశాలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

క్రీడాకారుల వసతి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడలో జరగనున్న జాతీయ జూనియర్ మహిళా హాకీ టోర్నమెంట్‌కు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులూ సమగ్రంగా కల్పించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ పోటీల కోసం వచ్చే క్రీడాకారుల వసతి ఏర్పాట్లను జెసి మంగళవారం పరిశీలించారు. సామర్లకోట పట్టణంలోని జిల్లా మహిళ సాధికారత సంస్థ భవనంలో 80 మంది క్రీడాకారులకు, విస్తరణ శిక్షణా కేంద్రంలో మరో 120 మందికి వసతి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, తహశీల్దారు కె..చంద్రశేఖర్ రెడ్డి, డిటి యడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి- తాళ్లరేవు, గండేపల్లి

తాళ్లరేవు మండలం పి.మల్లవరం సచివాలయం పరిధిలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు దూళిపూడి వెంకటరమణ, విళ్ళ సత్యనారాయణ, దడాల సత్తికొండ, గుత్తుల వెంకటరమణ, బుజ్జిబాబు, మోహన్, గోపి, బాబు, సుబ్బారావు, చిరంజీవి పాండురంగ, సింహచలం, వర్మ, వెంకటలక్ష్మి, ఝాన్సీ, నాగార్జున, గౌతమి, అజయ్, ప్రియాంక, తేజశ్రీ పాల్గొన్నారు.

గండేపల్లి మండలం మల్లేపల్లిలో మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ జి.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పి.చంద్రమౌళి, తదితరులు మరియు రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం ఉత్సాహపూరిత వాతావరణంలో కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్త, లలితా ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాలయకు, విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానన్నారు. చదువుతోపాటు ప్రతి విద్యార్థీ క్రీడల్లో ప్రావీణ్యత సాధించాలన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్ల వందనం స్వీకరించి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలను పిఇటిలు ఆర్.సత్యనారాయణ, పి.అనురాధ పర్యవేక్షించారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్

లిటిల్ స్టార్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక బొజ్జా వారి తోటలో ఉన్న లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌతమి నేత్రాలయ ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ కార్యక్రమాన్ని జనసేన నాయకులు కొత్తపల్లి బుజ్జి ప్రారభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ టి కామేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అనేకమైన సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. 200 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 30 మందిని గుర్తించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ టి.షాలేమ్ రాజు, డైరెక్టర్ టి.బ్యూలా గ్రేస్, ట్రస్ట్ సభ్యులు టి.రాధ, కృపారాణి, ఎం.ఏలియా, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - నిడదవోలు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని నిడదవోలు పోలీసులు కాపాడారు. నిడదవోలుకు చెందిన 25 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం నిడదవోలులో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లాడు. దీన్ని గమనించిన ఒక వ్యక్తి 112 కాల్ ద్వారా జిల్లా పోలీసుకు సమాచారం అందించారు. ఎస్‌పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు నిడదవోలు ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్, సిబ్బంది ఘటనా స్థలానికి పంపించారు. వారు వెంటనే సదరు వ్యక్తిని గుర్తించి ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అతని బంధువులకు సమాచారం అందించి వారితో పంపించారు. ఈ సందర్భంగా నిడదవోలు పోలీసులను, కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని పటవల పైడా కళాశాల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. యానాం సావిత్రి నగర్‌కు చెందిన చింతా శ్రీనివాస్(36) ద్విచక్ర వాహనంపై కాకినాడ వెళుతుండగా పైడా కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ మృతితో భార్య కన్నీరుమున్నీరైంది. కోరంగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తప్పిపోయిన ఎస్.అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలను పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్.అచ్యుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు ఈ నెల 28 నుంచి కనిపించట్లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. బాలికల వద్దగల సెల్ ఫోన్ సిగ్నల్స్, సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాలికలు అమలాపురం వైపు వెళుతున్నట్లు గుర్తించారు. అమలాపురం పోలీసుల సహకారంతో తప్పిపోయిన బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు, ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఘనంగా సర్పంచ్ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య పుట్టినరోజు వేడుక స్థానిక భవ్య స్కూల్లోను, స్థానిక పంచాయతీలోను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాయతీలో సిబ్బంది ఏర్పాటు చేసిన కేకును సర్పంచ్ లావణ్య కట్ చేశారు. సిబ్బందికి సర్పంచ్ లావణ్య స్వీట్లు, కేకు పంపిణీ చేశారు. అలాగే భవ్య స్కూల్‌లో వికలాంగ విద్యార్థుల కేరింతల మధ్య ఆమె కేకు కట్ చేసి అందరికీ పంచారు. విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసి, ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.మోక్షాంజలి, గుమస్తా కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని గోదావరి మధ్యమ డెల్టా డిస్టిబ్యూటరీ వైస్ ఛైర్మన్ కరటూరి నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక ముదునూరు వెంకటరాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఐదేళ్ల వైసిపిలో పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కుసంపూడి బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేయాలని ఎంపిపి కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మహేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, తహశీల్దార్ బియ్యం ముక్తేశ్వరరావు, సిడిపిఒ ఎ.గజలక్ష్మి, ఎంఇఒ బి.శ్రీనివాసరాజు, హౌసింగ్ ఎఇ జేజిబాబు, మండల పరిషత్ ఎఒ మంగతాయారు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేగాయమ్మ పేటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ వి.నాగకుమార్ పాల్గొని మాట్లాడారు. రైతులు అందరు తప్పనిసరిగా ఎరువులు వాడకం తగ్గించాలని, రైతుకు ఉన్న పొలంలో 20 సెంట్లు భూమినీ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. అవసరం మేరకు పురుగు మందులు వాడాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి టివిఆర్.మణిదీప్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని, క్రాఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆగస్టు 15వ తేదీలోపు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఒక రోజులోనే బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

ప్రజాశక్తి - యానాం

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని గమనించి దరఖాస్తు చేసిన ఒక రోజులోనే బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి నెల రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న విజిటర్ స్లిప్ ద్వారా తనను నేరుగా కలవచ్చని తెలిపారు. బకాయిలు చెల్లించలేని షాపులకు షోకాస్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. విడతలవారీగా బకాయిలు చెల్లించడానికి అవకాశం కల్పిస్తామన్నారు. బకాయిలు చెల్లించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్సులు త్వరగా అందజేయడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆగస్టు 1 నష్టపరిహారానికి ఆఖరి తేదీ

ప్రజాశక్తి - యానాం

మత్స్యశాఖ ద్వారా నష్టపరిహారం పొందని వారు ఆగస్టు ఒకటో తేదీ లోపు సంబంధిత పత్రాలు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఓటు గుర్తింపు కార్డు, బ్యాంక్ ఎకౌంట్, సొసైటీ సర్టిఫికెట్, ఫోటోలు తీసుకుని మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని మత్స్యశాఖ అధికారి డి.గొంతెయ్య తెలిపారు. ఈ పరిహారానికి సంబంధించిన వ్యక్తి మరణించినట్లయితే తమ నామిని యొక్క పత్రాలు, మరణించిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలని సూచించారు.

ఘనంగా సిఎస్ఆర్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన పుదుచ్చేరి విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ కమ్ అండర్ సెక్రెటరీ(ఎల్ఎడి) గిడ్డి బలరామ్ రచించిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పుస్తక ఆవిష్కరణ సభ మంగళవారం సర్కిల్ ది యానాంలో నిర్వహించారు. ఈ పుస్తకాన్ని యానాం ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు, కలైమామిణి పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆవిష్కరించారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది

భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలే శరణ్యం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలు పెంచడమే శరణ్యమని ప్రకతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎస్ విజయబాబుఅన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏలేశ్వరం కమిషనర్ ఎం.సత్యనారాయణ విద్యుత్ శాఖ ఎఇ సూర్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం బాధ్యతగా భావించాలన్నారు. శుభ, అశుభ కార్యక్రమాలకు గుర్తుగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ల నాగేశ్వరరావు, కోశాధికారి కోట శ్రీనివాస చక్రవర్తి, తిరగటి సత్యనారాయణ, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు, దువ్వా సూరిబాబు, వేల్పుల సూరిబాబు ఉన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన ముదునూరి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మాజీ ముఖ్యమంత్రి వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌ను మంగళవారం తాడేపల్లిలో నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు మదనూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురం పార్లమెంట్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యకమాలను వైఎస్.జగన్‌కు వివరించారు. నరసాపురం పార్లమెంట్లో ప్రతి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేలా కృషి చేయాలని వైఎస్.జగన్ సూచించారని తెలిపారు.

రేపటితో ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పూర్తి

ప్రజాశక్తి-కాజులూరు

ఇంటర్ ప్రవేశాలకు గురువారంతో గడువు ముగుస్తుందని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 31 గురువారంతో ఇంటర్ ప్రవేశాలకు గడువు ముగియనుందని, ఇంటర్ ప్రవేశాలకు అభ్యర్థులు పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ కాపీలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. గత సంవత్సరం 88 మంది విద్యార్థులు చేరగా ఈ సంవత్సరం 118 మంది విద్యార్థులు చేరారని తెలిపారు.

వాహనాల వేలంతో రూ.50,624 ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న 6 బైకుల వేలం ద్వారా రూ.50,624 ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకు కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎక్సైజ్ శాఖ ఎఇఎస్ జయమౌనిక సమక్షంలో ఈ బహిరంగ వేలం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణా తరగతుల పరిశీలన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు ఆదర్శ కాలేజీలో పాఠశాల లీడర్‌షిప్ శిక్షణా తరగతులను డిఇఒ పి.రమేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు ఉపయోగించుకుని పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ. హెచ్ఎం పాత్ర మెలుకువలపై ఆయన వివరించారు. శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ వి.జగన్మోహన్, ఎంఇఒ బివిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న జనసేన నేత తుమ్మలపల్లి రమేష్

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ సాయంతో నిర్వహించిన ఈ క్యాంటీన్‌లో ఆయన పాల్గొని పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు స్వామిని మణి భాస్కర్, మాధవు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, మరిసే రామకృష్ణ, పాటంశెట్టి రమేష్, గంధం శ్రీను, కనకరాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్యరామాపురం శివారులోని పుంత రోడ్డులో ఉన్న శ్మశాన వాటికకు రక్షణగా ప్రహరీ నిర్మాణానికి మున్సిపాలిటీ చర్యలు చేపట్టనున్నట్లు సామర్లకోట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య చెప్పారు. ఇటీవల కౌన్సిలర్ పితాని కృష్ణ మృతి చెందగా, ఆయన అంత్యక్రియల సమయంలో శ్మశాన వాటికలో పొదలు పెరిగి ఉండటం, రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో ఏర్పడ్డ ఇబ్బందులను ఇటీవల స్థానికులు చెప్పడంతో కమిషనర్ శ్రీవిద్య మంగళవారం పనులు పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ వెంట అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లిలో పేరుకుపోయిన పారిశుధ్య వ్యర్థాలను తొలగించేందుకు సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీధుల్లో ఉన్న పారిశుధ్యాన్ని, కాలువ పూడికతీత పనులను కూలీలను ఏర్పాటు చేసి జెసిబి, ట్రాక్టర్లతో తొలగిస్తున్నట్లు తెలిపారు పారిశుధ్య నిర్మూలన చర్యల్లో భాగంగా పనులు చేపట్టినట్లు తెలిపారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

సుబ్బంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరల్డ్ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా రంగంపేట మండలం సుభద్రంపేటలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవి శంకర్ తెలిపారు. పలువురికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామస్తులకు అవసరమైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎస్.శృతి, పేపకాయల సాయి బాబు, పూసల శ్రీను, పేపకాయల రాంబాబు, సాధనాల కృష్ణమూర్తి, నాగిరెడ్డి శ్రీను, కూటి సాయి బాబు పాల్గొన్నారు.

బోరు నిర్మాణ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

బంగారమ్మ గుడి వీధిలో మంచినీటి బోరు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆ వార్డు కౌన్సిలర్ గోకేడ అప్పారావు ఆధ్వర్యంలో ఆ ప్రాంత మహిళలు మంగళవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బోరు పని చేయకపోవటం వల్ల తమ ప్రాంతవాసులు తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిలర్ అప్పారావు మాట్లాడుతూ బోరు నిర్మించి రెండేళ్లు గడవకముందే పూర్తిగా పాడైపోయిందని, దాని స్థానంలో కొత్త బోరు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చి నెలలు గడుస్తున్నా బోరు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే బోరు నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వైస్ చైర్మన్ స్పందిస్తూ భూపరీక్ష పూర్తయ్యాక పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్యపై వినతి

కాకినాడ : కాకినాడ రూరల్ మండలంలో ఉన్న పగడాలపేట హైస్కూల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాహిత్, నగర ఉపాధ్యక్షులు గమ్మివేలు, వినతిపత్రాన్ని డిఆర్ఒ వెంకట్రావుకి సమర్పించారు.